సాక్షి బాపట్ల

శుక్రవారం । 14 । జూలై । 2023



దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై ఆషాఢ సారె మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఏడు వందల మంది భక్తులు గురువారం అమ్మవారికి సారెను సమర్పించారు.



ఘనంగా ఆడికృత్తిక మహోత్సవం

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ ఆడికృత్తిక మహోత్సవం సందర్భంగా గురువారం అమ్మవార్లు శాకంబరిగా దర్శనమిచ్చారు.

16న పెద్దింటమ్మ తల్లికి ఆషాఢ బోనాలు



అమరావతి: అమరావతి గ్రామ దేవత పెద్దింటమ్మ తల్లికి ఆదివారం ఆషాఢ మాసం భోనాలు సమర్పిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. స్థానిక మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా పెద్దింటమ్మ గుడికి చేరుకుంటారన్నారు.

న్యూస్‌రీల్


సంచార పశు ఆరోగ్య రథాల్లో ఉద్యోగాలు

గుంటూరు మెడికల్ : జిల్లాలో డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథాల్లో పైలెట్, డాక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పశు ఆరోగ్య సేవా రథాల జిల్లా మేనేజర్ ఎస్.లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్లుగా పనిచేయడానికి బ్యాచ్‌లర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. పైలెట్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు, మూడేళ్ల అనుభవం ఉండాలన్నారు. డాక్టర్ పోస్టులు ఐదు, పైలెట్ పోస్టులు 15 ఉన్నాయని, ఆసక్తి, అర్హత ఉన్నవారు 96188 36074 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేడు కలెక్టరేట్‌లో నవోదయం కార్యక్రమం

నరసరావుపేట: కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం నవోదయం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గురువారం కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలియచేశాయి. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల ప్రజల కోసం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రధానంగా విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం, యువ సాధికారిత అంశాల ఆధారంగా కార్యక్రమం జరగనుందని వివరించారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే నవోదయం కార్యక్రమానికి విద్య, ఉద్యోగ, ఉపాధి, పరిశ్రమల శాఖ అధికారులు, బ్యాంకర్లు హాజరవుతారని వెల్లడించారు. ఆయా సామాజిక వర్గాల ప్రజలు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కార్యాలయం సూచించింది.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 518.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎడమ కాలువకు 4,351 ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 5,701 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.00 అడుగుల వద్ద ఉంది.

కొల్లిపరలో 19.4 మి.మీ. వర్షం

కొరిటిపాడు(గుంటూరు) : గుంటూరు జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 19.4 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 0.8 మి.మీ వర్షం పడింది. సగటున 5.9 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా తెనాలి 12.4, పెదకాకాని 11.4, కాకుమాను 9.6, మేడికొండూరు 8.4, గుంటూరు పశ్చిమ 7.4, ఫిరంగిపురం 6.4, దుగ్గిరాల 5.8, పెదనందిపాడు 5.2, ప్రత్తిపాడు 4.8, తాడికొండ 3.4, గుంటూరు తూర్పు 3.2, చేబ్రోలు 2.2, మంగళగిరి 1.6, వట్టిచెరుకూరు 1.6, తాడేపల్లి 1.4, తుళ్ళూరు మండలంలో 1.2 మి.మీ చొప్పున వర్షం పడింది. జూలై మాసంలో 13వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 166.3 మి.మీ వర్షపాతం కురవాల్సి ఉండగా, ఇప్పటి వరకు 240.9 మి.మీ వర్షపాతం నమోదైంది.

యార్డులో 40,535 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 36,610 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 40,535 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.25,500 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.10,000 నుంచి 22,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 10,000 నుంచి రూ. 24,200 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,085 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

భద్రంగా ఈ-షోకేస్

- పోలీస్ స్టేషన్లలో ఈ-మాల్ఖానా
- డిజిటలైజేషన్ దిశగా అడుగులు
- సాక్ష్యాధారాలకు క్యూఆర్ కోడ్ విధానం
- జిల్లాలో ఇప్పటికే 566 కేసుల పత్రాలు భద్రపరిచిన సిబ్బంది



పోలీస్‌స్టేషన్‌లో ఈ-మాల్ఖానా విధానంలో భద్రపరిచిన కేసు ఫైల్స్

బాపట్లటౌన్: మారుతున్న పరిస్థితుల దృష్ట్యా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునే దిశగా పోలీస్‌శాఖ అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా పెండింగ్ కేసుల్లో త్వరితగతిన పురోగతి సాధించేందుకు జిల్లాలోని అన్ని స్టేషన్లలో ఈ మాల్ఖానా విధానాన్ని అమలుచేస్తోంది.

మాల్ఖానా అంటే..

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల డాక్యుమెంట్లు, స్వాధీనం చేసుకున్న వస్తువులను భద్రపరిచడాన్ని మాల్ఖానా అంటారు. స్థూలంగా చెప్పాలంటే సాక్ష్యాధారాలను భద్రపరిచే కేంద్రం. ఇప్పుడు ఈ విధానాన్ని డిజిటలైజ్ చేస్తున్నారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన సాక్ష్యాధారాలు, వాహనాల వివరాలకు ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్‌ను తయారు చేసి పత్రాలను ఒక బాక్స్‌లో భద్రపరిచి దానిపై క్యూఆర్ కోడ్ అతికిస్తారు. బాక్స్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ కేసు పూర్తి సమాచారం లభ్యమవుతుంది.

ప్రత్యేక యాప్

కేసు వివరాల నిక్షిప్తానికి పోలీస్ శాఖ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. కేసు నమోదైన తర్వాత దర్యాప్తు అధికారి కేసులో సీజ్ చేసిన ఆస్తులు, వాహనాలు, పత్రాల వివరాలను ఈయాప్‌లో నమోదు చేస్తారు. వెంటనే ఒకే రకమైన మూడు క్యూఆర్ కోడ్‌లు వస్తాయి. వాటిని ప్రింట్ తీసి ఒక కాపీని కేసు దర్యాప్తు ఫైల్‌, మరొక కాపీని సీజ్ చేసిన ప్రాపర్టీ బాక్స్‌పై, మరొకటి సీజ్ చేసిన ప్రాపర్టీ వివరాలు నమోదు చేసే రిజిస్టర్‌లో అతికిస్తారు. దర్యాప్తులో తదనంతరం జరిగే పరిణామాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నిక్షిప్తం చేస్తారు. దీనివల్ల ఎప్పుడు కేసు వివరాలు కావాల్సినా చూసుకోవచ్చు. ఆస్తులు భద్రపరిచే గదిలోనూ ప్రతి బాక్సుకు ఒక నంబర్ ఇస్తూ ర్యాక్‌లలో భద్రపరుస్తున్నారు. దీనివల్ల స్టేషన్ అధికారి మారినప్పుడు కేసు ప్రాపర్టీలను సులువుగా గుర్తించవచ్చు.

అన్ని పోలీస్ స్టేషన్లలో అమలు



జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ-మాల్ఖానా విధానాన్ని ఏర్పాటుచేశాం. దీనివల్ల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా ఛేదించే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ-మాల్ఖానా విధానం ప్రవేశపెట్టి రెండు నెలలవుతోంది. ఇప్పటివరకు 566 కేసుల పత్రాలు, సీజ్ చేసిన సామగ్రి ఈ విధానంలో భద్రపర్చాం.

– వకుల్ జిందాల్, ఎస్పీ, బాపట్ల

ఇప్పటివరకు డిజిటలైజ్ చేసిన కేసుల వివరాలు

అడవలదీవి	05	కొరిశపాడు	20
అద్దంకి	23	మార్టూరు	05
అమర్తలూరు	02	మేధరమెట్ల	11
బల్లికురవ	06	నగరం	02
బాపట్లరూరల్	04	నిజాంపట్నం	03
బాపట్లటౌన్	15	పర్చూరు	15
భట్టిప్రోలు	16	రేపల్లె టౌన్	12
చెరుకుపల్లి	01	సంతమాగులూరు	02
చినగంజాం	12	చందోలు	23
చీరాల 1 టౌన్	147	చోడాయపాలెం	01
చీరాల 2 టౌన్	20	చుండూరు	05
చీరాల రూరల్	07	వెదుళ్ళపల్లి	30
ఇంకొల్లు	84	వేమూరు	15
జె పంగులూరు	15	వేటపాలెం	05
కారంచేడు	40	యద్దనపూడి	03
కర్లపాలెం	03	మొత్తం	566
కొల్లూరు	14		--

బాలురుపై యువకుడి అసభ్య ప్రవర్తన

కర్లపాలెం: ముగ్గురు బాలురుపై ఓ యువకుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కర్లపాలెం ఏఎస్ఐ సాంబశివరావు కథనం మేరకు కర్లపాలెం పంచాయతీ రాజీవ్‌నగర్ గ్రామానికి చెందిన పొట్టిపోగు జాన్సన్(చిన్ను) అనే యువకుడు ఈనెల 9న అదే గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఓ బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామని, డీఎస్పీ వెంకటేశ్వర్లు విచారణ చేస్తున్నారని ఏఎస్ఐ సాంబశివరావు తెలిపారు.

నభూతో న భవిష్యతి



భూరక్ష కలికితు'రాయి': సర్వే అనంతరం హద్దురాయి పాతుతున్న సిబ్బంది

శరవేగంగా 'భూ రక్ష' రీ సర్వే

- ఇప్పటికే 58 గ్రామాల్లో సమగ్రంగా పూర్తి
- మొత్తం 173 గ్రామాల్లో పథకం అమలు
- ఇప్పటికే 134 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి
- రెండో దశలో 53 గ్రామాల్లో మ్యాపింగ్ పూర్తి
- మొత్తం 5,95,913 ఎకరాల్లో కొలతలు



'సర్వే' రైతుజనా సుఖీభవ: సర్వే చేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లాలో వైఎస్సార్-జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా రీ సర్వే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మొదటి దశలో ఐదు గ్రామాల్లో ఈ రీసర్వే పూర్తి చేయగా, రెండో దశలో 168 గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి జిల్లా మొత్తం సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే 53 గ్రామాల్లో మ్యాపింగ్ పూర్తయింది.

115 ఏళ్ల తర్వాత

ఎప్పుడో 1905లో బ్రిటిష్ హయాంలో భూముల సర్వే చేపట్టారు. ఆ తర్వాత భూముల సర్వే జరగలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాన్ని చేపట్టి రీసర్వే పనులు చేపట్టారు. గుంటూరు జిల్లాలో 2020 డిసెంబర్‌లో రీసర్వే ప్రారంభమైంది. ఎక్కడా ఏ ఒక్క రైతు, నిజమైన హక్కుదారుకు అన్యాయం జరగకుండా సర్వేను అధికారులు పకడ్బందీగా చేపడుతున్నారు. ఎక్కువ మంది కౌలు రైతులు ఉండటం, అసలు పట్టాదారులు అందుబాటులో లేకపోవడం వల్ల సర్వేలో కొంత జాప్యం జరుగుతోంది. అయినా సాధ్యమైనంత త్వరగా ఈ రీసర్వేను పూర్తిచేసేలా జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ప్రతి అంగుళం భూమినీ మ్యాపింగ్‌లోకి తీసుకు రావడంతోపాటు భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా సర్వే సాగుతోంది.

ఐదు గ్రామాల్లో విజయవంతంగా..

తొలుత పైలెట్ ప్రాజెక్ట్‌గా దుగ్గిరాల మండలంలోని దేవరాపల్లి అగ్రహారం, ప్రత్తిపాడు మండలంలోని కొండజాగర్లమూడి, వేమూరు మండలంలోని పులిచింతల పాలెం, యడ్లపాడు మండలంలోని మద్రిపాలెం, దాచేపల్లి మండలంలోని అలుగుమల్లిపాడులను రీసర్వేకు ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లో సర్వే ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. హక్కుదారులకు పత్రాల అందజేత కూడా పూర్తయింది.

134 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి

గుంటూరు జిల్లాలో మొత్తం 223 గ్రామాలు ఉండగా గుంటూరు డివిజన్‌లో 119, తెనాలి డివిజన్‌లో 104 గ్రామాలు ఉన్నాయి. సీఆర్‌డీఏ పరిధిలోని 20 గ్రామాలతోపాటు, మంగళగిరి- తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నాలుగు గ్రామాలు, 26 అర్బన్ గ్రామాల్లో ప్రస్తుతం సర్వే నిర్వహించడం లేదు. మిగిలిన 173 గ్రామాల్లో రీసర్వే చేపట్టారు. మొదటిదశలో ఐదు పైలెట్ గ్రామాల్లో సర్వే పూర్తయింది. 2,586 ఎకరాల్లో సర్వే పూర్తి చేసి 2,056 మంది రైతులకు భూహక్కు పత్రాలను అందజేశారు. రెండో దశలో 168 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ జరుగుతోంది. ఇప్పటి వరకు 134 గ్రామాల్లో డ్రోన్‌ను తిప్పి ఏరియల్ మ్యాపింగ్ పూర్తి చేశారు. మొత్తం 5,95,913 ఎకరాల్లో కొలతలు పూర్తయ్యాయి.

53 గ్రామాల్లో ఓఆర్ఐ పూర్తి

53 గ్రామాలకు సంబంధించి ఓఆర్ఐ(ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్)ను జారీ చేశారు. మేడికొండూరులో 11 గ్రామాలు, వట్టిచెరుకూరులో 13 గ్రామాలు, పెదనందిపాడులో 12 గ్రామాలు, ప్రత్తిపాడులో ఏడు గ్రామాలు, తెనాలిలో ఆరు గ్రామాలు, దుగ్గిరాలలో నాలుగు గ్రామాల్లో ఈ ఓఆర్ఐ ప్రక్రియ పూర్తయింది. మొత్తం 1,30,283 ఎకరాల్లో ఓఆర్ఐ పూర్తికాగా, 19,418 ఎకరాలకు రీసర్వే పూర్తయింది. వీటిని క్షేత్రస్థాయిలో భూమితో పోల్చి నిజ నిర్ధారణ(గ్రౌండ్ ట్రూతింగ్) చేసి 13 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశారు.

రైతులు సహకరించాలి



జిల్లాలో వైఎస్సార్-జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా రీ-సర్వే వేగంగా జరుగుతోంది. ఈ నెలాఖరుకు మొత్తం 173 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేస్తాం. గ్రామాల్లోకి అధికారులు వచ్చినప్పుడు రైతులు అందుబాటులో ఉండి సహకరిస్తే పని త్వరగా పూర్తవుతుంది.

– జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్

ఉపయోగాలివీ..

- సర్వే అనంతరం సంబంధిత భూమి, స్థలం యజమానికి ప్రింటెడ్ పాస్‌బుక్ ఉచితంగా ఇస్తారు.
- భూహద్దు, దస్తావేజు సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయి. చట్టబద్ధత వస్తుంది.
- గ్రామాల్లో సరిహద్దు వివాదాలకు పరిష్కారం దొరుకుతుంది.
- రీ సర్వే తర్వాత ఇచ్చే పట్టాలు, పాస్‌పుస్తకాలతో రుణాలు పొందవచ్చు.

బియ్యం, పప్పుల ధరలు తగ్గించాలి

వ్యాపారులకు జేసీ రాజకుమారి ఆదేశం

గుంటూరు వెస్ట్: నిత్యావసరాల ధరలు తగ్గించాలని జాయింట్ కలెక్టర్ రాజకుమారి వ్యాపారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో మిల్లర్లు, వ్యాపారులతో ఆమె సమావేశమయ్యారు. ప్రభుత్వం నిర్దేశించిన తాజా ధరలను వివరించారు. ఈ మేరకు అమ్మకాలు చేపట్టాలని సూచించారు. ఆదేశాలు బేఖాతరు చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతుబజారుల్లో బీపీటీ బియ్యాన్ని అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. వ్యాపారులు కొంత సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని జేసీ కోరారు. సమావేశంలో డీఎస్ఓ పద్మ, పౌరసరఫరాల సంస్థ డీఎం లక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు (కిలోకు రూపాయల్లో)

నిత్యావసరం	ఇప్పటివరకు ధర	తాజాగా ప్రభుత్వం నిర్దేశించిన ధర
స్టీమ్ బియ్యం	50	44
రా బియ్యం	56	48
మినప గుండ్లు	115	101

సీఎం వైఎస్ జగన్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

మంగళగిరి: గుంటూరు జిల్లా కృష్ణాయపాలెంలో గురువారం సీఎం కార్యక్రమాల కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ పర్యటించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణాయపాలెంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో త్వరలో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, నార్త్‌సబ్ డివిజన్ డీఎస్పీ జె.రాంబాబు, సీఐ అంకమ్మరావుతోపాటు పలువురు పోలీస్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్సీ తలశిల రఘురామ్

ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు

- పోక్సో, హత్యకేసుల్లో నిందితులపై రౌడీషీట్లు
- నేర సమీక్షలో ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్



మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్‌హాఫీజ్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పోక్సో, హత్య కేసుల్లోని నిందితులపై రౌడీషీట్లు తెరవాలని ఎస్పీ కె.ఆరిఫ్‌హాఫీజ్ పోలీసు సిబ్బందికి సూచించారు. నగరంపాలెం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాలులో గురువారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. దీర్ఘకాల పెండింగ్ కేసులపై ఆరాతీసి, త్వరగా ఛేదించాలని ఆదేశించారు. గతంలో ఐజీ నిర్వహించిన సమావేశంలో చర్చించిన కేసులపైనా విచారణ త్వరగా చేపట్టాలని పేర్కొన్నారు. ఎస్పీ ఆరిఫ్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిరంతరం నిఘా ఉంచాలని చెప్పారు. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యా సంస్థల వద్ద దిశ వాహనాలతో గస్తీ నిర్వహించాలని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే సుమారు 5,908 మందిపై 5,626 కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. పోక్సో, మహిళలపై జరిగే నేరాలతోపాటు రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. అదృశ్య కేసులను వేగంగా ఛేదించాలని సూచించారు. రోజూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. గంజాయి రహిత జిల్లా కోసం అందరూ కృషి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ కేసులను త్వరగా ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బంది, వార్డు మహిళా పోలీసులను ఎస్పీ అభినందించి, ప్రశంస పత్రాలు అందించారు. సమావేశంలో ఏఎస్పీలు ఎన్.షేల్కే (గుంటూరు తూర్పు), కె.సుప్రజ (పరిపాలన), ఎ.శ్రీనివాసరావు (క్రైం), డీఎస్ మహేష్ (ఎస్ఈబీ), కె.శ్రీనివాసరావు (ఎల్అండ్ఓ), డీఎస్పీలు సుభాష్ (ఎస్బీ), పోతురాజు (తుళ్ళూరు), ఉమామహేశ్వరరెడ్డి (పశ్చిమ), రాంబాబు (ఉత్తర), జనార్దన్‌రావు (తెనాలి), బాల సుందరరావు (ట్రాఫిక్), విజయశేఖర్ (ఎస్సి, ఎస్టి), శ్రీనివాసరావు (డిసిఆర్‌బి), ప్రకాష్‌బాబు (సీసీఎస్), చంద్రశేఖర్‌రావు (ఏఆర్), సెబ్ ఏఎస్ మణికంఠ, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

గర్భిణుల్లో రక్తహీనత నివారణకు చర్యలు

కలెక్టర్ రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: గర్భిణుల్లో రక్తహీనత, పోషణలోపం నివారణకు వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో గురువారం కలెక్టరేట్‌లోని స్పందన మందిరంలో ఆయన సమావేశం నిర్వహించారు. వైద్యాధికారులు పనితీరు మార్చుకోవాలని కలెక్టర్ హెచ్చరించారు. గర్భిణులు పోషణ లోపంతో బాధపడుతుంటే వైద్యాధికారులు సక్రమంగా పరీక్షలు నిర్వహించకపోవడం ఏమిటని నిలదీశారు. జిల్లాలో 6,920 మంది గర్భిణులు పోషణలోపంతో బాధపడుతుంటే వైద్యులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. 471 మంది గర్భిణులకు సకాలంలో వైద్య పరీక్షలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గర్భిణులకు రక్తహీనత పరీక్షలు ప్రతినెలా క్రమం తప్పకుండా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల పనితీరుపై వైద్యాధికారుల పర్యవేక్షణ లోపించిందని పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా ఉన్న వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సర్వే సకాలంలో ముగించాలని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్, కంటి వెలుగు కార్యక్రమాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. వైద్య, ఆరోగ్యశాఖలో అమలవుతున్న యాప్‌ల పనితీరుపై పర్యవేక్షణ పెంచాలన్నారు. ఎన్‌సీడీసీ స్క్రీనింగ్ సర్వే వేగంగా చేపట్టాలని చెప్పారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్.విజయమ్మ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

చినగంజాం: తమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేదని మనస్తాపానికి గురైన ఓ ప్రేమజంట బాత్రూమ్‌లు శుభ్రం చేసే హార్పిక్ ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన చినగంజాంలో చోటు చేసుకుంది. చీరాల ప్రభుత్వాసుపత్రి ఔట్ పోస్టు పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని చినగంజాం-2 సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్ మున్న, మున్నంవారిపాలెం సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నల్లమల ప్రవల్లిక గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. చీరాలకు చెందిన మున్న, పర్చూరు వీరన్నపాలేనికి చెందిన ప్రవల్లికలు స్థానికంగా ఉద్యోగ విధులు నిమిత్తం చినగంజాంలో వేర్వేరుగా గదులు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఈనేపథ్యంలో వారి మధ్య ప్రేమ ఏర్పడింది. అయితే వారి పెళ్లి విషయమై పెద్దలు అంగీకారం తెలపకపోవడంతో ఇరువురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇందులో భాగంగా ఒకరికి తెలియకుండా మరొకరు హార్పిక్ తాగారని పోలీసులు తెలిపారు. మున్నను చీరాల ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా కోలుకున్నట్లు తెలిపారు. ప్రవల్లిక పరిస్థితి కొంచెం విషమంగా ఉండటంతో గుంటూరు వైద్యశాలకు తరలించినట్లు సమాచారం.

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం కావాలి

కలెక్టర్ రంజిత్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: జగనన్న కాలనీలలో పక్కా గృహాల నిర్మాణం వేగంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. పక్కా గృహాల నిర్మాణం, జగనన్న సురక్ష కార్యక్రమాల నిర్వహణపై డివిజన్, మండల స్థాయి అధికారులతో గురువారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. పునాది దశ దాటని పక్కా ఇళ్ల నిర్మాణాలలో అధికారులు పురోగతి సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈనెల చివరి నాటికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు అధికారులు పనులు చేయించాలని ఆదేశించారు. వేమూరు మండలంలో పురోగతి తక్కువగా ఉండటంపై అధికారులను నిలదీశారు. లక్ష్యాలు చేరుకోకపోతే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. చీరాల, సంతమాగులూరు, చిన్నగంజాం మండలాల్లో అసలు పురోగతి లేదన్నారు. సమగ్ర ప్రణాళికతో అధికారులు విధులు నిర్వహించాలన్నారు.

జగనన్న సురక్షతో ముంగిళ్లలోకే సేవలు

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలను ముంగిళ్లలోకి తీసుకెళ్తున్నట్టు జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా జారీ చేస్తున్నట్టు వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య మేళాకు హాజరు కావాలి

నరసరావుపేటఈస్ట్‌:నెలనెలా సాహిత్య మేళాలో భాగంగా శనివారం నరసరావుపేటలో తిక్కన సోమయాజి సామాజిక సందేశం అంశంపై కలెక్టర్‌ ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమానికి జిల్లాలోని తెలుగు ఉపాధ్యాయులు, భాషా పండితులు హాజరు కావాలని డీఈఓ కె.శామ్యూల్‌ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి నిర్ణయం చారిత్రాత్మకం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్‌



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డొక్కా

పట్నంబజారు: సంక్షేమం ప్రతి ఒక్కరికీ అందేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు చారిత్రాత్మకమని వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్‌ చెప్పారు. గురువారం లాడ్జిసెంటర్‌లోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బి.ఆర్‌. అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు మేలు జరిగేలా రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ సీఎం వై.ఎస్‌.జగన్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాణిక్య వరప్రసాద్‌ మాట్లాడుతూ దళిత, పేద వర్గాలకు మేలు జరిగేలా 54 వేల ఎకరాల అసైన్డ్‌ భూములు, తొమ్మిది వేల ఎకరాలు పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకోవడం సంతోషదాయకమన్నారు. ఆలయ అర్చకులకు సంబంధించి రూ.10 వేలు జీత భత్యాలు అందజేయడంతోపాటు, వయో పరిమితిని పెంచడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్‌ షజిల,వైఎస్సార్‌సీపీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ యాదవ్‌, షేక్‌ నూరిఫాతిమా, సీడీ భగవాన్‌, ఆవుల సుందరరెడ్డి, గనిక ఝాన్సి, ముంతాజ్‌, పెరికల కృష్ణమోహన్‌, సింగు నరసింహారావు, బందా రవీంద్రనాథ్‌, బత్తుల దేవానంద్‌ పాల్గొన్నారు.

జగనన్న నిర్ణయం హర్షణీయం

ఎంపీ నందిగం సురేష్‌



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ నందిగం

ఉద్దండరాయునిపాలెం (తాడికొండ): అసైన్డ్‌ రైతుల విషయంలో సీఎం జగన్‌ మోహన్‌ రెడ్డి కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం హర్షణీయమని బాపట్ల ఎంపీ, రాష్ట్ర ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు నందిగం సురేష్‌ అన్నారు. గురువారం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో రాజధాని అసైన్డ్‌ రైతులతో కలిసి ఆయన క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా అసైన్డ్‌ భూముల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, కానీ సీఎంగా వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత పేదల కోసం అహర్నిశలు పరితపిస్తూ వాటికి చట్టబద్ధత కల్పించి రిజిస్ట్రేషన్‌ హక్కులు కల్పించడం చరిత్ర అన్నారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు అసైన్డ్‌ రైతులకో ప్యాకేజీ, పట్టా భూమికో ప్యాకేజీ వచ్చేలా వ్యత్యాసం చూపించి తన బినామీలను పెట్టి అన్యాక్రాంతం చేశాడన్నారు. గతంలో అసైన్డ్‌ భూములు అమ్మకానికి అవకాశం లేక తప్పనిసరి అయితే తక్కువ ధరలకు అమ్ముకొని పేదలు నష్టపోయారన్నారు. నేడు సీఎం జగన్‌మోహన్‌ రెడ్డి తీసుకున్న నిర్ణయంతో అసైన్డ్‌ భూములకు సాధారణ భూములకు కల్పించినట్లు రిజిస్ట్రేషన్‌లు జరిగి ధరలు పెరగనుండటం పేదల ఆర్థిక ఎదుగుదలకు బాటలు వేసిందనడంలో సందేహం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, అసైన్డ్‌ రైతులు పాల్గొన్నారు.

హర్షం వ్యక్తం చేసిన అర్చకుల సంఘం

- జీతభత్యాల పెంపుపై సర్వత్రా హర్షం
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చక సమాఖ్య

పట్నంబజారు: అర్చక లోకం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డిని నిండు మనస్సుతో ఆశీర్వదించారు. సర్వేజనాః సుఖినోభవంతు అని స్వచ్ఛమైన మనస్సుతో ప్రతి ఒక్కరిని ఆశీర్వదించే అర్చకులకు సీఎం వై.ఎస్‌.జగన్‌ రూ.10 వేలు జీత భత్యాలు పెంచుతూ కేబినెట్‌ నిర్ణయం నేపథ్యంలో గురువారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సెంటర్‌లో సీఎం జగన్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈమేరకు ఇకపై అర్చకులకు అసలు రిటైర్మెంట్‌ లేకుండా చట్ట సవరణ చేసేందుకు కేబినెట్‌ ఆమోద ముద్ర వేసింది. దీనికి యావత్‌ అర్చకలోకం సంతోషాన్ని వ్యక్తం చేసింది. గుంటూరు అర్బన్‌ బ్యాంకు డైరెక్టర్‌ బందా రవీంద్రనాథ్‌, కార్పొరేటర్‌ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) మాట్లాడుతూ సీఎం వై.ఎస్‌.జగన్‌ మోహన్‌రెడ్డి బ్రాహ్మణ పక్షపాతి, బ్రాహ్మణులకు ఆయన తగిన గుర్తింపు, గౌరవం, సముచిత స్థానం కల్పించడమే అందుకు నిదర్శనమన్నారు. అన్ని రంగాలలో తమకు అగ్రతాంబూలం ఇచ్చి గత పాలకులెవరూ చేయని విధంగా బలోపేతం చేస్తున్నారన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.300 కోట్లు కేటాయించి పూర్తిస్థాయిలో బలోపేతం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పరుచూరి శ్రీనివాసచార్యులు, పరుచూరి కృష్ణమాచార్యులు, కంతేటి లక్ష్మీనారాయణ శర్మ, చెన్నాభట్ల కాశ్యపశర్మ, గురుదేవ్‌, కంతేటి శ్యామ్‌, నోరి పార్థసారథి, అన్నం రాజు సాయిరాం పాల్గొన్నారు.

సైబర్‌ నేరాలపై అవగాహన అవసరం

గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌ హఫీజ్‌

నగరంపాలెం: సైబర్‌ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ కె.ఆరిఫ్‌ హఫీజ్‌ సూచించారు. ఇటీవల కొందరు బాధితులు వివిధ రూపేణ నగదు పోగొట్టుకున్నారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో వివిధ కేసుల్లో దర్యాప్తు జరిపి, రూ.6.37 లక్షలను బాధితులకు అప్పగించడం జరిగింది. దీంతో పలువురు బాధితులు గురువారం జిల్లా పోలీస్‌ కార్యాలయ ఆవరణలో ఎస్పీ కె.ఆరిఫ్‌ హఫీజ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. పోగొట్టుకున్న డబ్బులు వచ్చే పరిస్థితులు ఉండవని నిరాశపడ్డామని, తమ డబ్బులు తిరిగి అప్పగించడం ఆనందంగా ఉందని బాధితులు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ తమ వ్యక్తిగత వివరాలను ఇతరులకు తెలియపరచవద్దన్నారు. ఏఎస్పీ(పరిపాలన) కె.సుప్రజ, ఐటీకోర్‌ఎస్‌ఐ శ్రీనాథ్‌ పాల్గొన్నారు.

పోయిన సెల్‌ఫోన్లు సైతం...

ఇప్పటి వరకు వందలాది మంది బాధితులకు పోగొట్టుకున్న



మొబైల్‌ఫోన్లు అందుకున్న వారితో ఎస్పీ ఆరిఫ్‌ హఫీజ్‌

సెల్‌ఫోన్లను అప్పగించినట్లు జిల్లా ఎస్పీ కె. ఆరిఫ్‌ హఫీజ్‌ అన్నారు. వివిధ చోట్ల మొబైల్‌ఫోన్లను పోగొట్టుకున్న సుమారు వంద మంది బాధితులకు వారి సెల్‌ఫోన్లను గురువారం జిల్లా పోలీస్‌ కార్యాలయ ఆవరణలో అందించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ప్రారంభించిన సెల్‌ఫోన్‌ వాట్సప్‌ నంబర్‌కు బాధితుల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. వాట్సప్‌ నంబర్‌ 8688831574కు మెసేజ్‌ వచ్చిన వెంటనే టీపీడబ్ల్యూ (ఐటీ కోర్‌) ప్రత్యేక బృందం వివరాలు సేకరిస్తుందన్నారు.

బాబు, పవన్‌, ఆనందబాబుల దిష్టిబొమ్మలు దహనం

పల్లెకోన(భట్టిప్రోలు): టీడీపీ నాయకుల దమనకాండకు నిరసనగా వైఎస్సార్‌ సీపీ ఆధ్వర్యంలో గురువారం భట్టిప్రోలు మండలం పల్లెకోనలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌ కల్యాణ్‌, మాజీ మంత్రి నక్కా ఆనందబాబుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ శేరు శ్రీనివాసరావు మాట్లాడుతూ రోజురోజుకి టీడీపీ నాయకుల ఆగడాలు మితిమీరుతున్నాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో తమకు పుట్టగతులు ఉండవనే అక్కసుతో వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. పవన్‌ కల్యాణ్‌ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. రానున్న ఎన్నికలలో చంద్రబాబు, పవన్‌ కల్యాణ్‌లకు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరుపతిబాబు, సర్పంచులు జయవరపు రాధాకృష్ణమూర్తి, పెద్దిశెట్టి రాంబాబు, వైఎస్సార్‌ సీపీ నాయకులు బొల్లెద్దు ప్రతాప్‌, జస్వంత్‌ రాజ్‌,



మాట్లాడుతున్న అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ శేరు శ్రీనివాసరావు

పెద్దిశెట్టి వెంకటేశ్వరరావు, మండవ రామకోటేశ్వరరావు, తోట అనీల్‌కుమార్‌, ఏపూరి నాగు, పంతగాని నాంచారయ్య, బాలు, కనపర్తి శరత్‌, దిల్‌షాద్‌, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

మార్టూరు:అక్రమంగా గంజాయి కలిగి ఉన్న వ్యక్తుల నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితుల నుంచి నాలుగు కిలోల గంజాయిని మార్టూరు పోలీసులు బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కే కమలాకర్‌ వివరాల మేరకు.. స్థానిక అమరావతి నూలుమిల్లులో కార్మికులకు గంజాయి అక్రమంగా సరఫరా అవుతున్న సమాచారం అందుకున్న ఎస్సై సిబ్బందితో బుధవారం రాత్రి నూలుమిల్లు క్వార్టర్స్‌లో తనిఖీలు నిర్వహించారు. మిల్లులో కార్మికులుగా పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రం భద్రకి జిల్లా కోతా ర్‌ గ్రామానికి చెందిన శిఖానందసాహు, సుషంత్‌కుమార్‌జేన, ఒడిశా రాష్ట్రం బక్శంత్‌పూర్‌ గ్రామానికి చెందిన అశిష్‌దాస్‌, మార్టూరుకు చెందిన కరవది హర్షవర్ధన్‌లు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండు నిమిత్తం అద్దంకి మెజిస్ట్రేట్‌ ముందు హాజరు పరచినట్లు ఎస్సై తెలిపారు.

విద్యతోనే ఉన్నత స్థాయికి చేరువయ్యేది

వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని క్రికెటర్‌ అంబటి రాయుడు అన్నారు. వట్టిచెరుకూరు మండలం ముట్లూరులోని సెయింట్‌ గ్జేవియర్స్‌ హైస్కూలులో గురువారం క్రికెటర్‌ అంబటి రాయుడు పర్యటించారు. కొద్ది రోజుల కిందట ఇదే స్కూలును రాయుడు సందర్శించిన సమయంలో పాఠశాల పూర్వ వైభవానికి కృషి చేసి, వసతులను మెరుగుపరిచేందుకు తోడ్పాటునందించాలని చర్చి ఫాదర్‌ దిలీప్‌కుమార్‌, ప్రధానోపాధ్యాయురాలు జ్యోస్నిమాలు కోరారు. సానుకూలంగా స్పందించిన రాయుడు పాఠశాలకు తనవంతు సాయం అందించారు. స్థానిక పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో మౌలిక వసతుల కల్పన నిమిత్తం రూ. 5 లక్షల చెక్కును ఫాదర్‌ దిలీప్‌కుమార్‌, ప్రధానోపాధ్యాయురాలు జ్యోస్నిమాలకు అందజేశారు. అంబటి రాయుడు మాట్లాడుతూ ఇంతటితోనే కాదని, పాఠశాలను మరింతగా అభివృద్ధి చేసి, పునర్వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పెయింట్లు, మరమ్మతులకు కూడా సహకరిస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందని, విప్లవాత్మక మార్పులను తీసుకువస్తుందని చెప్పారు. విద్యార్థులు మంచిగా కష్టపడి, మంచి గైడెన్స్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఫాదర్‌, హెచ్‌ఎంలు, రాయుడిని సత్కరించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ యెనుముల రాంబాబు పాల్గొన్నారు.

గర్భిణులు, పిల్లలకు యు విన్‌ పోర్టల్‌ ద్వారా వ్యాక్సినేషన్‌

- జిల్లా వైద్యాధికారి శోభారాణి
- వైద్యాధికారులు, సిబ్బందికి శిక్షణ

నరసరావుపేట: జిల్లాలోని గర్భిణులు, చిన్న పిల్లలకు యు విన్‌ పోర్టల్‌ ద్వారా రియల్‌ టైం వ్యాక్సినేషన్‌ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌ జి.శోభారాణి వెల్లడించారు. గురువారం పల్నాడు రోడ్డులోని తన కార్యాలయంలో యు విన్‌ పోర్టల్‌, మిషన్‌ ఇంద్రధనస్సుపై నరసరావుపేట, గురజాల డివిజన్‌లకు చెందిన వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీస్‌లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నూతన పోర్టల్‌ ద్వారా సంబంధిత ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఇమినేషన్‌ స్లాట్‌ సంబంధిత హెల్త్‌ వెల్నెస్‌ సెంటర్లలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలకు నిర్దేశిస్తారన్నారు. దీని అమలుకు టీకాలు వేయించుకోవాల్సిన గర్భిణులు, చిన్నపిల్లలను హెల్త్‌ వెల్నెస్‌ సెంటర్లకు తీసుకువచ్చి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్‌ శోభారాణి

అక్కడే టీకా వేసి ఈ పోర్టల్‌ ద్వారా వారి వివరాలను అప్‌ లోడ్‌ చేస్తారన్నారు. ఈ లాగిన్‌ను ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నిర్వహిస్తారని, విజయవంతం చేసేందుకు ప్రజలలకు అవగాహన కలిగించాలన్నారు. ఇది ఒక ఇన్నోవేటివ్‌ కార్యక్రమమని చెప్పారు. శిక్షణ కార్యక్రమాన్ని స్టేట్‌ టీఓటి శివశంకర్‌ నిర్వహించగా, జిల్లా ఇమ్యూనైజేషన్‌ అధికారి డాక్టర్‌ బి.గీతాంజలి, డెప్యూటీ డీఎంహెచ్‌ డాక్టర్‌ చంద్రశేఖర్‌, ఎఫ్‌డీపీ నోడల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ హనుమకుమార్‌, డీపీవో ఓన్నూరు భాష, నీలకంటేశ్వరావు పాల్గొన్నారు.

ఘనంగా తాడిపర్తి చిత్రపటం ఆవిష్కరణ

గుంటూరు లీగల్‌: గుంటూరు బార్‌ అసోసియేషన్‌లో సీనియర్‌ న్యాయవాది దివంగత తాడిపర్తి రామమోహనరావు చిత్రపట ఆవిష్కరణ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ డీవీఎస్‌ఎస్‌ సోమయాజులు చిత్రపటాన్ని ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్‌.బి.జి. పార్థసారథి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జిలు, సబ్‌ జడ్జిలు, జూనియర్‌ సివిల్‌ జడ్జిలు, ప్రెసిడెంట్‌ కె.వి.కె.సురేష్‌, వైఎస్‌ ప్రెసిడెంట్‌ దాసరి ఉమామహేశ్వరరావు, జనరల్‌ సెక్రటరీ నాగ వంశీకృష్ణ, ట్రెజరర్‌ విజయ రాజ కుమార్‌, జీబీఏ మాజీ



తాడిపర్తి చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ సోమయాజులు

ప్రెసిడెంట్‌ శాంతకుమార్‌, సీనియర్‌ న్యాయవాది వైకే, ఏపీపీలు, గుంటూరు బార్‌ అసోసియేషన్‌ కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో రాయితీపై విత్తనాలు

నకరికల్లు: రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి అన్నారు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో భాగంగా 50శాతం రాయితీపై విత్తనాలను గురువారం గుండ్లపల్లి, నర్సింగపాడు గ్రామాల్లోని రైతులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో భాగంగా వరిలో బీపీటీ - 5204 రకం ఫౌండేషన్‌ విత్తనాలను ఒక్కో రైతుకు 30 కిలోల చొప్పున 25మందికి పంపిణీ చేశామన్నారు. నారుమడి యాజమాన్యం, విత్తనశుద్ధి తదితర విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. డాట్‌ సెంటర్‌ ప్రధాన సమన్వయకర్త వరప్రసాద్‌ మాట్లాడుతూ వరిలో చేపట్టే మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణనిచ్చారు. అనంతరం జాతీయ ఆహార భద్రతా పథకంలో భాగంగా కందిపంట విస్తీర్ణం పెంచేందుకు



విత్తనాలు పంపిణీ చేస్తున్న డీడీఏ శివకుమారి, డాట్‌ సమన్వయకర్త వరప్రసాద్‌

100శాతం రాయితీపై కంది విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.ప్రసన్నకుమార్‌, ఎం.సంధ్యారాణి, మహమ్మద్‌ జాన్‌ అహ్మద్‌, రైతులు పాల్గొన్నారు.

16న గ్రూప్‌-2 ఉచిత అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్‌: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించనున్న గ్రూప్‌-2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఈనెల 16న ఉచిత అవగాహన సదస్సుతో పాటు ఆన్‌లైన్‌, ఆఫ్‌లైన్‌లో రాష్ట్రస్థాయి మాక్‌ టెస్ట్‌ నిర్వహిస్తున్నట్లు అమిగోస్‌ 21వ సెంచరీ ఐఏఎస్‌ అకాడమీ అకడమిక్‌ డైరెక్టర్‌ జనార్దన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీపీఎస్సీ నూతన సిలబస్‌పై వర్క్‌షాప్‌, ప్రిలిమ్స్‌ ప్రీ మాక్‌టెస్ట్‌ను ఆదివారం ఉదయం 9.00 గంటలకు హైదరాబాద్‌ అశోక్‌ నగర్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 040-35052121, 9000230734 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలను 9133237733 నంబరుకు వాట్సప్‌ చేయాలని తెలిపారు.

చనిపోయిన మిర్చి మొక్కలు

- పాత కక్షల నేపథ్యంలో గడ్డి మందు చల్లిన వైనం
- పోలీసులకు ఫిర్యాదు



వెల్దుర్తి: పాతకక్షల నేపథ్యంలో మండలంలోని ఉప్పలపాడు గ్రామ సమీపంలో ఉన్న శ్రీ బాలాజీ నర్సరీలో మిర్చి మొక్కలకు గడ్డి మందు చల్లగా చనిపోయాయి. నర్సరీ యజమాని మందా సీతారామిరెడ్డి మాట్లాడుతూ గతంలో రెంటాల గ్రామానికి చెందిన వెన్నా శ్రీనివాసరెడ్డితో కలిసి పదేళ్ల నర్సరీని నిర్వహించామని, మనస్పర్థలు రావటంతో గతేడాది విడిపోయామని తెలిపారు. ఆ విషయాన్ని మనసులో పెట్టుకొన్న శ్రీనివాసరెడ్డి నర్సరీలోని మిర్చి మొక్కలకు మూడు గేట్‌ వాల్స్‌ ద్వారా వచ్చే నీటిలో గడ్డి మందు కలిపినట్లు తెలిపారు. దీంతో ట్రేలలో ఉన్న మిర్చి మొక్కలు చనిపోయాయన్నారు. ఈ మిర్చి మొక్కల విలువ రూ.కోటి ఉంటుందన్నారు. సంబంధిత శాఖాధికారులు విచారణ జరిపి నాకు న్యాయం చేయాలన్నారు. ఈ విషయంపై వెల్దుర్తి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు

మార్టూరు: అమాయకులు, నిరక్షరాస్యులే లక్ష్యంగా ఏటీఎంల వద్ద కాపుకాసి ఏటీఎం కార్డులను తారుమారు చేసి చోరీలను పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు గురువారం అరెస్ట్‌ చేశారు. ఎస్సై కే కమలాకర్‌ వివరాల మేరకు.. పర్చూరు మండలం వీరన్నపాలెం గ్రామానికి చెందిన ముప్వా వీరయ్య చౌదరి అలియాస్‌ వీరయ్య ఏటీఎంల వద్ద నిరక్షరాస్యులను నమ్మబలికి నగదు డ్రా చేసి ఇస్తామంటూ వారి కార్డు తీసుకొని పిన్‌ నంబర్‌తో ఏటీఎం పనిచేయటం లేదని చెప్తాడు. తిరిగి వారికి కార్డు ఇచ్చే క్రమంలో వీరయ్య తన వద్ద సిద్ధంగా ఉంచుకున్న నకిలీ కార్డులను వారికి ఇచ్చి అనంతరం బాధితుల కార్డులు వినియోగించి నగదు డ్రా చేసుకోవటం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న వీరయ్యను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా విషయం వెలుగు చూసింది. నిందితుడి నుంచి 16 ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నారు. వీరయ్యను అద్దంకి మెజిస్ట్రేట్‌ ముందు హాజరు పరచినట్లు ఎస్సై తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేటఈస్ట్‌: పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2023కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్‌ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10 సంవత్సరాలు సర్వీస్‌ పూర్తిచేసి, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హత కలిగి ఉన్న వారు దరఖాస్తులను ఆన్‌లైన్‌ ద్వారా పంపాలని కోరారు.